క్లుప్తంగా

ఎస్పీని కలసిన పత్తికొండ డీఎస్పీ



ఎస్పీ కృష్ణకాంత్‌ను కలసి పూలబొకే అందజేస్తున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసులు

కర్నూలు: జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన పత్తికొండ పోలీస్ సబ్ డివిజన్‌కు నియమితులైన డీఎస్పీ ఎ.శ్రీనివాసులు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గత నెల 26న జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీనివాసులును నూతన సబ్ డివిజన్‌కు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు.

రేపు నవ్వుతో వైద్యం సదస్సు

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచనవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న నవ్వుతో వైద్యం గురించి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లుకర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక ఏ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో సాయంత్రం 6గంటలకు ప్రారంభం కానున్న సదస్సులో అంతర్జాతీయ మిమిక్రీ ఆర్టిస్ట్ జె.రమేష్ చేత మిమిక్రీ ఉంటుందన్నారు.

నేడు వీహెచ్‌పీ ధర్నా

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు భజరంగ్ దల్ నగర సంయోజక్ నాగరాజు శుక్రవారం తెలిపారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఉగ్రవాద మూలాలు కలిగిన పీఎఫ్ఐతో కలిపి జాతీయ భావాలు, దేశభక్తి కలిగిన భజరంగ్ దల్‌ను నిషేధిస్తామని ప్రకటించడాన్ని నిరసిస్తూ ధర్నా చేస్తున్నట్లు పేర్కొన్నారు. గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతూ హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నట్లు తెలిపారు. హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నిరాశ్రయులకు చేయూత



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న పట్టణ నిరాశ్రయుల గృహం సమీపంలో నిరాశ్రయులకు ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ జిల్లా గవర్నర్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయడానికి, చేయూత ఇవ్వడానికి ఆసక్తి ఉన్న వారు 93968 61308 నంబర్‌ను సంప్రదించి అంతర్జాతీయ లయన్స్ క్లబ్ సభ్యత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు లయన్ రాయపాటి నాగలక్ష్మి, కార్యదర్శి సి.డి. జి.గిరి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత కలిగి ఉండాలి



సందేశమిస్తున్న రామకృష్ణ ప్రభు

కర్నూలు కల్చరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక సేవా తత్పరత కలిగి ఉండాలని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు సూచించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో చందన యాత్ర ఉత్సవాలు, నృసింహ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర దేవతా మూర్తులకు చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నిత్య నైవేద్యం సేవలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రభు సందేశం ఇస్తూ నిత్యం భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు సంస్కారం, నైతిక విలువ పెంపొందేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీకాంప్లెక్స్: రామబాణం,ఉగ్రం,విరుపాక్ష, ది కేరళ స్టోరీ, పొన్నియిన్ సెల్వన్–2,గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3, పొన్నియిన్ సెల్వన్–2, ఉగ్రం, విరుపాక్ష, ఏజెంట్, రామబాణం
వెంకటేష్ సినీకాంప్లెక్స్:ఉగ్రం, విరుపాక్ష, రామబాణం
ఐనాక్స్: గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3, ఉగ్రం, దికేరళస్టోరీ,ఇవిల్‌డెడ్‌రైజ్,పొన్నియిన్ సెల్వన్–2
భరత్ కాంప్లెక్స్ : ఇవిల్‌డెడ్ రైజ్, విడుదల పార్ట్–1, రుద్రుడు
శ్రీరామ : రామబాణం
రాజ్: పొన్నియిన్ సెల్వన్–2
విజయ : రామబాణం

కర్నూలును బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

- నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- రూ.3.44 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): కర్నూలు నగరాన్ని రాష్ట్రంలోనే బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం నగర పాలక సంస్థ పరిధిలోని 49వ వార్డు, 50వ వార్డు సంకల్‌బాగ్ వద్ద రూ.2 కోట్లతో తుంగభద్ర నది తీరాన వాకింగ్, సైకిల్ ట్రాక్, బెంచీలు, గ్రీనరీ వంటి అభివృద్ధి పనులు, 51వ వార్డులో రూ.30 లక్షలతో, 47వ వార్డులో రూ.40 లక్షలతో 17వ వార్డులో రూ.74 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణాలకు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో పెద్ద ఎత్తున్న మౌలిక సదుపాయాలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగర ప్రజలకు సౌకర్యాలు కల్పించేడమే లక్ష్యంగా రూ.506 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పాదయాత్ర ద్వారా కర్నూలుకు చేరుకుంటున్న నారా లోకేష్ ఇక్కడి అభివృద్ధి పనులను చూసి ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు.

లోకేష్.. ఏ ముఖం పెట్టుకుని కర్నూలు వస్తున్నావ్?

తెలుగుదేశం పార్టీ కర్నూలును న్యాయ రాజధానిని వ్యతిరేకమని, అలాంటప్పుడు ఆ పార్టీ నేత లోకేష్ ఏ ముఖం పెట్టుకొని కర్నూలుకు వస్తున్నాడని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ప్రశ్నించారు. 5 ఏళ్ల టీడీపీ పాలనలో నగరానికి నిధులు ఎంత ఖర్చు చేశారో... తమ హయాంలో ఎంత ఖర్చు చేశామో చర్చించడానికి కొండారెడ్డి బురుజు వద్ద బహిరంగ చర్చకు రావాలన్నారు. టీడీపీ పాలనలో పరిశుభ్రతలో జాతీయ స్థాయిలో 221 ర్యాంకులో ఉన్న కర్నూలును తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 55వ ర్యాంకుకు తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిపామన్నారు. ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అరుణ, కార్పొరేటర్లు సిత్రా సత్యనారయణమ్మ, సోంపల్లి క్రిష్ణకాంత్ రెడ్డి, షేక్ అహ్మద్, మౌనికారెడ్డి, కైపా పద్మాలత, రాజేశ్వరరెడ్డి, ఎస్ఈ వేణుగోపాల్, ఎంఈలు శేషాసాయి, షాకీర్ హుస్సేన్, డీఈఈలు రవిప్రకాష్ నాయుడు, ఏఈలు పాల్గొన్నారు.

వినాయక్ ఘాట్ పరిశీలన

కర్నూలు (టౌన్): వినాయక్ ఘాట్ వద్ద ఉన్న వంతెనను శుక్రవారం నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ పరిశీలించారు. గాయత్రీ ఎస్టేట్ సర్కిల్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రహదారిలో ఎడమ వైపు రోడ్డు తక్కువగా ఉండటం, కుడి వైపు ఎక్కువగా ఉండటంతో సమస్యలు వస్తున్నాయి. ఇదే సమస్యను మేయర్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకుపోవడంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు. రోడ్డు సైడ్ వ్యాపారులతో మాట్లాడారు.డివైడర్లను కొంత మార్పు చేయాలని గుర్తించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సిత్రా సత్యనారయణమ్మ, కైపా పద్మలత పాల్గొన్నారు.

సుంకేసులకు 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు 850 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 0.917 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

ఫీవర్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



నీటి నిల్వలను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఎన్‌సీడీ సర్వేతో పాటు ఫీవర్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కొత్తపేట పరిధిలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పించి, దోమల పెరుగుదలను అరికట్టాలన్నారు. జ్వర లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి తగిన చికిత్సలు అందించాలన్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీలు

నగరంలోని కార్తీక్ ఆసుపత్రి, ఎస్ఎస్ ఆసుపత్రి, విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌లలోని స్కానింగ్ కేంద్రాలను శుక్రవారం డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. పీసీ పీఎన్‌డీటీ యాక్ట్‌కు సంబంధించిన రికార్డులు, రిపోర్ట్‌లు పరిశీలించారు. ఆయన వెంట యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మహాలక్ష్మి, డెమో శ్రీనివాసులు, పీసీ పీఎన్‌డీటీ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

భూసేకరణ పనులను వేగవంతం చేయండి

- జేసీ నారపురెడ్డి మౌర్య



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లోని భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జేసీ నారపురెడ్డి మౌర్య తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆమె వీడియోకాన్ఫరెన్స్ ద్వారా స్పందన, రీసర్వే, మ్యుటేషన్ ఇతర రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సెబ్ పోలీసు స్టేషన్‌లు, టూరిజం స్పాట్లకు భూ కేటాయింపులు త్వరగా చేయాలన్నారు. ఇందుకోసం అవసరమైన ప్రతిపాదనలను వెంటనే పంపాలని సూచించారు. రీసర్వేలో స్టోన్ ప్లాంటేషన్‌ను మే 15వ తేదీలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వెనుకబడిన మండలాల తహసీల్దార్లు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. స్పందనలో రీఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉస్మానియా విద్యార్థికి బంగారు పతకం



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సయ్యద్ సమీయుద్దీన్

కర్నూలు (టౌన్): ఈనెల 1 నుంచి తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఏపీ సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 65 కేజీల విభాగంలో ఉస్మానియా కళాశాల బీఏ మొదటి సంవత్సరం విద్యార్థి డి.వీరేష్ బంగారు పతకం సాధించాడు. విద్యార్థిని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీయుద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ రఫీక్ అహమ్మద్ అభినందించారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి



కారల్ మార్క్స్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్):స్థానిక సుర్జీత్ భవన్‌లో శుక్రవారం కారల్ మార్క్స్ జయంతిని సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు భావ జాలంతో పనిచేసేవారు కారల్‌మార్క్స్ విధానాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్,పార్వతయ్య, నాయకల్లు రవి, మద్దిలేటి, షేక్షా, నూర్‌బాషా పాల్గొన్నారు.

- కర్నూలు(సెంట్రల్): మతోన్మాద వ్యతిరేక పోరాటానికి అరుణోదయ రామారావు ఆద్యుడు అని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ అన్నారు. శుక్రవారం గోకారి భవన్‌లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాప సభ్యుడు, న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అరుణక్షదయ రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రమణ, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ వేసవి శిబిరం ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న రామాంజనేయులు

కర్నూలు (టౌన్): స్థానిక అశోక్‌నగర్‌లోని ఆర్‌కే అకాడమీలో రైఫిల్ షూటింగ్ శిక్షణ శిబిరాన్ని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు బి.రామాంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా చేయకుండా విద్యార్థులు క్రీడా సాధనతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎండీ బాషా, కోచ్ రవికుమార్ పాల్గొన్నారు.

వాల్మీకి స్మృతి వనం ఏర్పాటు చేయాలి

కర్నూలు(అర్బన్): అమరావతిలో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించి మహర్షి వాల్మీకి స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ (వాల్మీకి) బోయ హక్కుల పోరాట సమితి నేతలు కోరారు. యువగళం పాదయాత్రలో భాగంగా పాణ్యం నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను బీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జే శ్రీనివాసులునాయుడు, నాయకులు ఎం బాలసంజన్న తదితరులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి/బోయల జనాభా అధికంగా ఉన్న ఉమ్మడి కర్నూ లు, అనంతపురం జిల్లాల్లో రెండు పార్లమెంట్, ఆరు అసెంబ్లీ స్థానాలను కేటాయించాలన్నారు. వాల్మీకి/బోయ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు నిధులు కేటాయించాలన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించాలన్నారు. లోకేష్‌ను కలిసిన వారిలో నాయకులు మహర్షి రమణ, ఎం సుధాకర్ తదితరులు ఉన్నారు.

పనులు వేగవంతం చేయండి

- ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): వర్షాలు కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులు వేగవంతం చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. శుక్రవారం ఆయన విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా సుమారు 350 స్తంభాలు పడిపోవడంతో పాటు 52 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయన్నారు. సామగ్రి జిల్లా స్టోర్స్‌లో సిద్ధంగా ఉందని, ఇండెంట్ మేరకు తెచ్చుకుని పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అత్యవసర పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్ఈ

ముగ్గురికి గాయాలు

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రహదారిలో ప్యాలకుర్తి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరుకు చెందిన ముగ్గురు యువకులు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు.. గూడూరుకు చెందిన మధుశేఖర్ (24), గోవర్ధన్, వెంకట్రాముడు బైక్‌పై కోడుమూరు వైపు వస్తూ కర్నూలు నుంచి కర్ణాటక వైపు వెళుతున్న కారును వెనుకనుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మధుశేఖర్‌కు తీవ్ర గాయలవ్వగా, గోవర్ధన్, వెంకటరాముడు స్వల్పంగా గాయపడడంతో స్థానికులు కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మధుశేఖర్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు.

అంబేద్కర్ భవన్‌లో అన్నీ సమస్యలే !



అంబేద్కర్ భవన్



నీరు పుష్కలంగా ఉన్న బోరు

- నీరు ఉన్నా పైప్‌లైన్లు పాడవడంతో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



మరమ్మతులకు గురైన పైప్‌లైన్

కర్నూలు(అర్బన్): నగరం నడిబొడ్డున ఉన్న బీఆర్ అంబేద్కర్ భవన్‌ను సమస్యలు చుట్టుముట్టాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ భవన్‌లో అనేక సమస్యలు తిష్టవేశాయి. ఈ భవన్‌లో వివాహాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీలకు రోజుకు రూ.1,500, బీసీ, ఇతరులకు రూ.4 వేలు, కుల సంఘాల సమావేశాలకు రోజుకు రూ.1,500 మాత్రమే చెల్లించాల్సి ఉంది. అద్దె ఉండడం, నగరం మధ్యలో అందరికీ అందుబాటులో ఉన్నందున అధిక శాతం మంది ఈ భవన్‌లోనే వివాహాలు, ఇతరత్రా కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు మక్కువ చూపుతున్నారు. అయితే ఈ భవన్‌లో ప్రస్తుతం ఫ్యాన్లు, లైట్లు సరిగా పని చేయడం లేదు. బోరు నుంచి సింటెక్స్ ట్యాంక్‌కు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్లు పాడైపోవడం వల్ల బోరులోని నీటిని వినియోగించుకోలేక పోతున్నారు. వివాహాలు, ఇతరత్రా కార్యక్రమాల సమయంలో బాత్‌రూముల్లో డ్రమ్ములు పెట్టి నీటిని నింపుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. టాయ్‌లెట్లు, బాత్‌రూములకు నీరు సరఫరా కాకపోవడం వల్ల భవన్‌ను అద్దెకు తీసుకున్న వారు బయటి నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ పైప్‌లైన్ మరమ్మతులకు కేవలం రూ.40 వేల నుంచి రూ.50 వేలకు మించి ఖర్చు అయ్యే పరిస్థితి లేదు. సంబంధిత సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పైప్‌లైన్ మరమ్మతులకు అంచనాలు రూపొదించి ఇంజినీరింగ్ శాఖకు పంపినా, పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. దీంతో ఈ భవన్‌లో కార్యక్రమాలు నిర్వహించుకునే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కర్నూలు క్రీడాకారుల సత్తా



ఏపీ సీఎం కప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన కర్నూలు హ్యాండ్‌బాల్ జట్టు

కర్నూలు(టౌన్): ఈనెల 1వ తేదీ నుంచి తిరుపతి పట్టణలో జరుగుతున్న ఏపీ సీఎం కప్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు సత్తా చాటారు. శుక్రవారం నిర్వహించిన హ్యాండ్ బాల్ ఫైనల్ పోటీల్లో కడప జట్టుపై 38–22 గోల్స్ చేసి కర్నూలు జట్టు బంగారు పతకం సాధించింది. బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో విశాఖపట్నం జట్టుపై వరుస సెట్లలో విజయం సాధించి బంగారు పతకం సాధించింది. విజేతలుగా నిలిచిన రెండు జట్ల సభ్యులకు సీఈఓ రమణ, చీఫ్ కోచ్ నటరాజరావు, హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి అభినందనలు తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కౌతాళం మండలం కరణి గ్రామానికి చెందిన మారయ్యను కులం పేరుతో దూషించిన శ్రీరాములుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఆంధ్రా గురుస్వామి, ఉపాధ్యక్షులు జి.కృష్ణ, డి.విజయమ్మ కోరారు. శుక్రవారం వారు బుధవారపేటలోని సమితి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కులం పేరుతో దూషించాడని మారయ్య కౌతాళం పోలీసులకు ఫిర్యాదు చేయగా రాజీ కావాలని ఒత్తిడి చేయడం తగదన్నారు.

గడప గడపలో సంతోషం



మహిళలకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): సంక్షేమ పథకాలతో గడప గడపలో సంతోషం వెల్లివిరుస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రజువారం కర్నూలు నగరం 39వ వార్డులోని కొండారెడ్డి నగర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలకు సత్వరం పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని కోరారు. నగర పాలక సంస్థ అధికారులు, కార్పొరేటర్ సాంబ, వైస్ ఎంపీపీ–2 నెహేమ్యా, సచివాలయ కన్వీనర్లు నారాయణ, ఇస్మాయిల్, కోటేశ్వర్ రావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలపండి

- ఎక్కడ పడితే అక్కడ నిలిపితే పోలీసులకు అప్పగిస్తాం
- కలెక్టర్ డాక్టర్ జి.సృజన



ట్రాఫిక్ రికవరీ వ్యాన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చే ప్రజలు తమ వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలని కలెక్టర్ జి.సృజన సూచించారు. ఎక్కడపడితే అక్కడ నిలిపే వాహనాలను ట్రాఫిక్ పోలీసులకు అప్పగిస్తామన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మెయిన్ ఎంట్రెన్స్‌లో ఉంచిన వాహనాలను ట్రాఫిక్ రివకరీ వ్యాన్ తీసుకెళ్లేందుకు ప్రయత్నించింది. కొన్ని వాహనాలను వ్యాన్‌పైకి ఎక్కించింది. విషయం తెలుసుకున్న ఉద్యోగ సంఘాల నేతలు అక్కడికి చేరుకుని ట్రాఫిక్ రికవరీ వ్యాను అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.

పార్కింగ్ కోసం నాలుగు ప్రదేశాల గుర్తింపు..

కలెక్టరేట్‌లో ముందు నుంచి వాహనాల పార్కింగ్‌పై నిర్లక్ష్యం ఉంది. కొందరైతే గాంధీ విగ్రహం సమీపంలో రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. మెయిన్ ఎంట్రెన్స్‌లోనూ ఇదే పరిస్థితి. కొన్నిసార్లు కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నతాధికారుల వాహనాలు సైతం వెళ్లలేనంతగా రోడ్డుపైనే వాహనాలను నిలిపేసి వెళ్తున్నారు. సమస్య పరిష్కారం కోసం గత కలెక్టర్లు జి.వీరపాండియన్, పి.కోటేశ్వరరావులు యత్నించారు. అందులో భాగంగా కలెక్టరేట్‌లోనే నాలుగు పార్కింగ్ ప్రదేశాలను గుర్తించారు. నిర్మించిన షెడ్లతోపాటు డీఆర్వో కార్యాలయం పక్కన, డీఈఓ కార్యాలయం ఎదుట, సునయన ఆడిటోరియం వెనుకభాగం, సర్వే ఏడీ కార్యాలయం ఎదుట ఉన్న ప్రదేశాలను పార్కింగ్ కోసం కేటాయించారు. సునయన వెనుకభాగం, సర్వే ఏడీ కార్యాలయాల వెనక ఫోర్ వీలర్ పార్కింగ్ కోసం కేటాయించి చిన్న చిన్న పనులు కూడా చేశారు. అయితే చెప్పిన అధికారులు బదిలీపై వెళ్లడం, ఉన్న అధికారులు పట్టించుకోకపోవడంతో పార్కింగ్ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఉద్యోగులు, బయట నుంచి వచ్చే వారు వాహనాలను ఎక్కడ పడితే అక్కడే పెట్టి వెళ్తుండటంతో తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌గా జి.సృజన కలెక్టరేట్ సుందరీకరణతోపాటు ట్రాఫిక్‌పై దృషి సారించారు. కలెక్టరేట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఆమె సానుకూలంగా ఉన్నారు. అందులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ మెయిన్ ఎంట్రెన్స్‌లో నిలిపిన వాహనాలను ట్రాఫిక్ పోలీసులకు అప్పగించారు. అయితే ఉద్యోగ సంఘాల నాయకులు కొందరు అడ్డుకోవడంతో వదిలేశారు. శనివారం నుంచి తప్పనిసరిగా కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలపాలని, లేకపోతే ట్రాఫిక్ పోలీసులకు అప్పగిస్తామని కలెక్టర్ హెచ్చరించారు.